స్వర్ణ భారత జ్యోతి
తెలుగు దినపత్రిక

SBJ NEWS స్వర్ణ భారత జ్యోతి

రిపోర్టర్స్ కావలెను
పత్రికా రంగంలో అనుభవం కలిగిన రిపోర్టర్లు జిల్లా, నియోజకవర్గ ఇన్చార్జిలుగా, మండల రిపోర్టర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువకులకు కావలెను.
ఫోన్ నెంబర్ : 966282126

ప్రసురణ : తెలంగాణ/ఆంధ్రప్రదేశ్, సంపుటి : 05 సంచిక : 16 ఎడిటర్.. చెరుకు జగన్ గౌడ్ పేజిలు : 04, వెల రూ. 5రూ/ ఆదివారం - 19 - ఏప్రిల్ - 2026

### లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకుక్కెదురు...

## విపక్షాల తీరుపై చంద్రబాబు ఫైర్



- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించని వైనం
- అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజారిటీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు

### మహిళా బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు సీఎం రేవంత్ రెడ్డి

- మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారు



- మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసింది
- "మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి

## భాజపా నాటకాన్ని దేశ ప్రజలు చూశారు

అతివల కోసం కొత్తగా రిజర్వేషన్ బిల్లు తేవాలి: కేటీఆర్



భారాస సహా అన్ని రాజకీయ పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలంగా ఉన్నప్పటికీ భాజపా రాజకీయాలతోనే వీగిపోయింది

డీలిమిటేషన్ అంశాన్ని అనవసరంగా జోడించి క్లిష్టతరం చేయడంతోనే బిల్లు నిలిచిపోయింది



### బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను

## ఏర్పాటు చేయండి: సీఎం రేవంత్

- ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుంది

దిల్లీ: కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



### తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ

## ఎన్నికలకు ఈసీ కసరత్తు.. మే నెలలోనే ఎన్నికలు?

- ★ మే నెలలోనే పోలింగ్ నిర్వహించేందుకు వేగంగా కసరత్తు
- ★ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ముందుకు సాగుతున్న ప్రక్రియ

హైదరాబాద్: తెలంగాణలో మరోసారి ఎన్నికల వాతావరణం వేడెక్కింది. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇప్పుడు మండల, జిల్లా ప్రజాపరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) కసరత్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా తయారీకి మిగతా.. 2లో

### భారతదేశ చరిత్రలో

# మరపురాని దినం

### రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి

- జాతీయ విపత్తును నివారించిన రోజు
- అప్పుడే ప్రధాని మోదీకి లేఖ...
- అభివృద్ధిలో పాలుపంచుకున్న రాష్ట్రాలకు శిక్ష కాకూడదని...
- మహిళా రిజర్వేషన్లు ప్రజాస్వామ్యానికి నైతిక అవసరం



హైదరాబాద్: లోక్‌సభలో రాజ్యాంగ సవరణ నల్ల బిల్లును ఓడించడానికి రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్ష నాయకులంతా ఏకమై జాతీయ విపత్తును నివారించిన మిగతా.. 2లో



## దక్షిణ భారత్, చిన్న రాష్ట్రాలకు విపక్షాలు అన్యాయం చేశాయి: లోకేశ్

ఇప్పటివరకు ఆర్టికల్ 81 ప్రకారం రాష్ట్రాల మధ్య స్థానాల పంపిణీ ఫ్రీజ్‌లో ఉండేది

అమరావతి: పునర్విభజన, రాజ్యాంగ సవరణ బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు.. దక్షిణ భారతదేశం, ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేశాయని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. ఇప్పటివరకు ఆర్టికల్ 81 ప్రకారం రాష్ట్రాల మధ్య స్థానాల పంపిణీ ఫ్రీజ్‌లో ఉండేదని వ్యాఖ్యానించారు. ఈ బిల్లులు లేకపోతే, 2026 జనగణన తర్వాత జనాభా ఆధారంగా మాత్రమే స్థానాలు నిర్ణయిస్తారన్న లోకేశ్.. దీంతో మంచి పనితీరు చూపిన రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఇది ఫెడరల్ సమతుల్యతపై నేరుగా దాడి చేసినట్లేనన్నారు. ఈ నష్టం ప్రతిపక్ష పార్టీల వల్ల జరిగిందని లోకేశ్ విమర్శించారు.

# 'రప్పా రప్పా నరకడం', 'రక్తాభిషేకాలు చేయడం' వారి సంస్కృతి

### గెలవరనుకుంటే నా సన్నిహితులకు కూడా టికెట్లివ్వలేదు

- ★ జగన్ రాజకీయాల్లో ఉంటే రాష్ట్రానికి నష్టం
- ★ వైకాపా నాయకులు పొట్టేళ్లను నరికి రక్తాభిషేకాలు చేస్తున్నారు
- ★ అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరుకుతాం అని పోస్టర్లు పెడుతున్నారు



అమరావతి: 'జగన్ ఇంట్లో ఉంటే ఆయన ఇంటి వరకే నష్టం.. కానీ ఆయన రాజకీయాల్లో ఉంటే రాష్ట్రానికి నష్టం. వైకాపా నాయకులు పొట్టేళ్లను నరికి రక్తాభిషేకాలు చేస్తున్నారు, అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరుకుతాం అని పోస్టర్లు పెడుతున్నారు. ఇదీ వాళ్ల సంస్కృతి' అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. మిగతా.. 2లో



### మహిళలకు ద్రోహం చేయడం

## జాతి విద్రోహమే

నిడదవోలు: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిరసన ర్యాలీ చేపట్టాయి. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్రోహమంటూ నేతలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ ర్యాలీలో కూటమి నేతలు మాధవ్, కందుల దుర్గేశ్, సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'రిజర్వేషన్లు వస్తాయని మహిళలు ఆశపడ్డారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్, మిత్ర పక్షాలు మహిళా బిల్లును అడ్డుకున్నాయి. మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహం. మహిళలను గౌరవించి.. అన్ని రంగాల్లో ఆదరించడం మన సంస్కృతి. సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ద్రోహం చేశారు. ఇది ప్రారంభం మాత్రమే. మహిళా లోకమంతా ఏకమైంది" "చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయి. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్రం స్పష్టత ఇచ్చింది. మహిళల రిజర్వేషన్ల కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నాం. పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరం. విపక్ష పార్టీలు ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతాయి" అని చంద్రబాబు ధ్వజమెత్తారు.



### బుధవారమే డెడ్‌లైన్.. ఒప్పందం

## కుదరకుంటే మళ్లీ బాంబులు

- డీల్ కుదరకుంటే మళ్లీ బాంబుల దాడులు తప్పవని హెచ్చరిక

ఢిల్లీ: అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. వచ్చే బుధవారం లోపు ఒప్పందం ఖరారు కాకపోతే ఇరాన్‌పై మళ్లీ బాంబు దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ట్రంప్ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని కొట్టిపారేసింది.

## విపక్షాలు శిక్ష అనుభవించక తప్పదు

### కోట్ల మంది మహిళలకు విపక్షాలు సమాధానం చెప్పాలి

రాబోయే రోజుల్లో ఆ పార్టీలు శిక్ష అనుభవించక తప్పదు"

పండుగ చేసుకుంటున్నారా?: కిరణ్ రిజిజు

డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగదని.. మహిళా రిజర్వేషన్ల విషయంలో తాము చిత్తశుద్ధితోనే వ్యవహరించాం



న్యూఢిల్లీ: 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. మిగతా.. 2లో

### ఎన్డీయేకు చీకటి రోజు..

## వారికి తొలి ఓటమి


అప్పుడు తెలుస్తుంది.. మహిళా వ్యతిరేకులు ఎవరో"

ఇది డీలిమిటేషన్, మహిళల హక్కుల కోసం తీసుకొచ్చిన బిల్లు కాదు

విపక్షాలన్నీ ఏకతాటి పైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయి

ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం

"బిల్లు ఆమోదం పొందినా.. పొందకపోయినా అది తమకు విజయమే



ఢిల్లీ: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పందించారు. మిగతా.. 2లో



### 'ఇంతకు తెగిస్తారా?'..

## నిర్మలపై మమత ఫైర్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఎన్నికల సంగ్రామం అనూహ్య మలుపులు తిరుగుతూ మరింత వేడెక్కింది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు రాజకీయ పార్టీలు వేస్తున్న ఎత్తుగడలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ) ఉల్లంఘించి, మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసేలా వ్యవహరిస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ)డిమాండ్ చేయడం ఆసక్తికరంగా మారింది.

## రష్యా చమురుపై అమెరికా యూటర్న్..
## మరో నెల రోజులు ఆంక్షలు ఎత్తివేసిన అగ్రరాజ్యం!

ఢిల్లీ: రష్యా నుంచి దిగుమతి చేసుకునే చమురుపై విధించిన ఆంక్షల విషయంలో అమెరికా ప్రభుత్వం అనూహ్యంగా తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఆంక్షల నుంచి మినహాయింపును మరో నెల రోజుల పాటు పొడిగిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో భారత్ సహా పలు దేశాలకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలను అదుపు చేసేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ శుక్రవారం రాత్రి ఈమేరకు కొత్త లైసెన్స్‌ను జారీ చేసింది. దీని ప్రకారం, రష్యా చమురు, పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోలుకు 2026 మే 16 వరకు అనుమతి లభించింది. అయితే, కేవలం రెండు రోజుల క్రితమే అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ మినహాయింపును పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేయడం గమనార్హం. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం పూర్తి భిన్నమైన నిర్ణయం తీసుకుంది. ఈ పొడిగింపు వల్ల భారతీయ రిఫైనరీలకు భారీ ఊరట లభించినట్లయింది. ఏప్రిల్ 17 నాటికి సముద్ర మార్గంలో రవాణాలో ఉన్న (లోడ్ అయిన) రష్యా చమురును ఎలాంటి ఆంక్షల భయం లేకుండా భారత్ ఇకపై దిగుమతి చేసుకోవచ్చు. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, హర్మూజ్ జలసంధి వద్ద రవాణాకు అంతరాయాలు ఏర్పడటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ ధరల ఒత్తిడిని తగ్గించి, మార్కెట్‌ను స్థిరీకరించేందుకే అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికాకు యురేనియం ఇచ్చేది లేదు..
# తేల్చి చెప్పిన ఇరాన్

ఇరాన్: తమ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియంను ఏ దేశానికీ బదిలీ చేసే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ముఖ్యంగా అమెరికాకు యురేనియంను పంపే అంశం ఎన్నడూ తమ పరిశీలనలో కూడా లేదని తేల్చి చెప్పింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ప్రభుత్వ టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలపై బఘాయి స్పష్టతనిచ్చారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు పూర్తిస్థాయిలో రాకపోకలు కొనసాగుతాయని చెప్పడం కొత్త దౌత్యపరమైన ఒప్పందంలో భాగం కాదని తెలిపారు. ఏప్రిల్ 8న అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మేరకే ఈ ప్రకటన చేశారని వివరించారు. ఈ ఒప్పందాన్ని లెబనాన్‌కు వర్తింపజేయడంలో అమెరికా విఫలమైందని ఇరాన్ ఆరోపించింది. హర్మూజ్ జలసంధిలో అమెరికా నావికా దళం దిగ్బంధనాన్ని కొనసాగిస్తే, తాము కూడా ప్రతిచర్యలు తీసుకుంటామని బఘాయి హెచ్చరించారు. ఇరాన్‌పై సంయుక్త దాడుల నేపథ్యంలో ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ ఈ జలసంధిలో ఇజ్రాయెల్, అమెరికా నౌకలపై ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిగా ఇరాన్ ఓడరేవులకు వచ్చే నౌకలను అమెరికా అడ్డుకుంటోంది. ప్రస్తుతం పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని, ఇరాన్ ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ ప్రయత్నాలు సాగుతున్నాయని బఘాయి తెలిపారు.

## పాత నోట్ల మార్పిడికి మరో ఛాన్స్..?
# వైరల్ వార్తలపై క్లారిటీ ఇచ్చిన పీఐబీ

ఢిల్లీ: 2016లో రద్దయిన పాత ₹500, ₹1000 నోట్లను మార్చుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో అవకాశం కల్పించిందంటూ సోషల్ మీడియాలో ఒక వార్త విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కేంద్ర ప్రభుత్వ అధికారిక విభాగం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) స్పష్టం చేసింది. ఇది పూర్తిగా నకిలీ వార్త అని, ప్రజలు ఇలాంటి వదంతులను నమ్మవద్దని హెచ్చరించింది. పాత నోట్ల మార్పిడికి సంబంధించి ఆర్బీఐ ఎలాంటి కొత్త మార్గదర్శకాలను విడుదల చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్-చెక్ టీమ్ తేల్చిచెప్పింది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సందేశాలు, స్క్రీన్‌షాట్‌లు పూర్తిగా నకిలీవని పేర్కొంది. కరెన్సీకి సంబంధించిన ఏ సమాచారం కోసమైనా ఆర్బీఐ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే విశ్వసించాలని ప్రజలకు సూచించింది. ఇదే సమయంలో, ప్రస్తుతం చలామణిలో ఉన్న కొత్త ₹500 నోట్లను కూడా రద్దు చేయబోతున్నారనే మరో వదంతిని కూడా ప్రభుత్వం ఖండించింది. ఈ నోట్లు యథాతథంగా చెల్లుబాటులో ఉంటాయని, వాటిని రద్దు చేసే ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేసింది. ఇలాంటి ధ్రువీకరించని, తప్పుడు సమాచారాన్ని ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని పీఐబీ ప్రజలను కోరింది. వాస్తవానికి రద్దయిన పాత నోట్లకు ఇప్పుడు ఎలాంటి ఆర్థిక విలువ లేదు. వాటిని మార్చుకునే అవకాశం కూడా పూర్తిగా ముగిసిపోయింది.

# తెరిచినట్టా.. మూసినట్టా..
# హర్మూజ్ వద్ద గందరగోళం..

ఢిల్లీ: ప్రపంచ ఇంధన రవాణాకు జీవనాడిగా భావించే హర్మూజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తత, గందరగోళం నెలకొన్నాయి. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం ప్రకటించారు. లెబనాన్ లో కాల్పుల విరమణ అమలులో ఉన్నంత కాలం హర్మూజ్ తెరిచే ఉంటుందని, అన్ని దేశాల నౌకలు రాకపోకలు సాగించవచ్చని చెప్పారు. అయితే, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) నిర్దేశించిన మార్గంలోనే నౌకలు రాకపోకలు సాగించాల్సి ఉంటుందని అరాఘ్చీ షరతు విధించారు. హర్మూజ్ తెరిచామంటూ ఇరాన్ మంత్రి చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. ఇందుకు ఇరాన్ కు ఆయన థ్యాంక్స్ కూడా చెప్పారు. అయితే, హర్మూజ్ జలసంధిపై అమెరికా నేవీ కొనసాగిస్తున్న బ్లాకేడ్ అలాగే ఉంటుందని చెప్పారు. నౌకల రాకపోకలపై తమ పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇదిలావుండగా, హర్మూజ్ తెరిచామని ఇరాన్, అమెరికా ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. కఠిన నిబంధనలు, ఇరు దేశాల మధ్య అపనమ్మకం కారణంగా వందలాది చమురు, సరుకు రవాణా నౌకలు సముద్రంలోనే నిలిచిపోయాయి. కొన్ని రోజుల క్రితం ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగాయి. చర్చల అనంతరం ఈ మార్గాన్ని పునఃప్రారంభించేందుకు ఇరాన్ అంగీకరించింది. అయితే, ఈ మార్గంలో ప్రయాణించే ప్రతి నౌకను తమ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్ జీసీ) క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని షరతు విధించింది. ఈ తనిఖీల పేరుతో జరుగుతున్న జాప్యం, కఠిన వైఖరి నౌకాయాన సంస్థలను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు, అమెరికా తన మిత్రదేశాల నౌకల రక్షణ కోసం యుద్ధ నౌకలను రంగంలోకి దించింది. ఇరాన్ నిబంధనలను అమెరికా వ్యతిరేకిస్తుండటంతో ఇరు పక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి తోడు, ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు బీమా కవరేజీ ఇచ్చేందుకు కంపెనీలు వెనుకాడుతున్నాయి. కొన్ని సంస్థలు ప్రీమియంలను భారీగా పెంచడంతో ఓడల యజమానులు ముందుకు సాగేందుకు సాహసించడం లేదు. 'మార్గం తెరిచామని ఇరాన్ చెబుతున్నా, క్షేత్రస్థాయిలో యుద్ధ వాతావరణం ఉంది. చిన్న పొరపాటు జరిగినా పరిస్థితి చేయి దాటిపోతుంది' అని ఓ ప్రముఖ షిప్పింగ్ ఏజెంట్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ చమురు రవాణాలో 20% వాటా ఉన్న ఈ జలసంధి వద్ద ప్రతిష్టంభన కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.

## విపక్షాలు శిక్ష అనుభవించక
# తప్పదు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. మహిళా బిల్లును వ్యతిరేకించిన విపక్షాలు పెద్ద తప్పు చేశాయని అన్నారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. "మహిళా బిల్లును వ్యతిరేకించి విపక్షాలు పెద్ద తప్పు చేశాయి. కోట్ల మంది మహిళలకు విపక్షాలు సమాధానం చెప్పాలి. రాబోయే రోజుల్లో ఆ పార్టీలు శిక్ష అనుభవించక తప్పదు" అని అన్నారు.

పండుగ చేసుకుంటున్నారా?: కిరణ్ రిజిజు

మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుకోవడం ఘోరమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కాంగ్రెస్‌తో పలుమార్లు సంప్రదింపులు జరిపాం. అయినా అడ్డుకున్నారు. మహిళా బిల్లును అడ్డుకుని పండుగ చేసుకోవడం దుర్మార్గం. ఈ బిల్లు ఎలా అప్రజాస్వామికమో రాహుల్ గాంధీ చెప్పాలి అని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మూడు రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన కేంద్రం.. మహిళా రిజర్వేషన్లతో పాటు డీలిమిటేషన్ సంబంధిత మొత్తం మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. అయితే శుక్రవారం రాజ్యాంగ సవరణ-131పై లోక్‌సభలో ఓటింగ్ జరగ్గా మెజారిటీ చేకూరక ఈ బిల్లు వీగిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్లకు తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని.. ఎన్డీయే ప్రభుత్వం రాజకీయానికి దిగిందని.. డీలిమిటేషన్ అంశాన్ని ఈ రిజర్వేషన్లతో ముడిపెట్టడాన్నే విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగదని.. మహిళా రిజర్వేషన్ల విషయంలో తాము చిత్తశుద్ధితో వ్యవహరించామని ఇటు కేంద్రం అంటోంది.

## లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు చుక్కెదురు...
# విపక్షాల తీరుపై చంద్రబాబు ఫైర్

అమరావతి: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే కీలక బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు చారిత్రక తప్పిదానికి పాల్పడ్డాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశం మాత్రమే కాదని, పార్లమెంటులో సమాన ప్రాతినిధ్యం ఆశిస్తున్న లక్షలాది మంది మహిళలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు. ఈ విషయాన్ని దేశం గుర్తుంచుకుంటుందని హెచ్చరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 131 రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం కాగా, ఆ మార్కును అందుకోకపోవడంతో బిల్లు వీగిపోయింది. 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పరిణామంపై ఏపీ సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను రీపోస్ట్ చేస్తూ, మహిళా సాధికారతకు అడ్డుపడిన ప్రతిపక్షాల వైఖరిని ఆయన తప్పుబట్టారు. వారి చర్యల వల్ల దేశం ఒక చారిత్రక అవకాశాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## మహిళా బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు

ఢిల్లీ: మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. "మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారు. మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలి" "మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదు" అని సీఎం రేవంత్ అన్నారు.

## తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ
# ఎన్నికలకు ఈసీ కసరత్తు..

మొదటి పేజి తరువాయి



ఇందులో భాగంగా ఓటర్ల జాబితా తయారీకి కీలక ఆదేశాలు జారీ చేసింది. పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల నిర్వహణపై ఎస్ఈసీ దిశానిర్దేశం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం 2025 జులై 10 నుంచి 2026 ఫిబ్రవరి 5 వరకు సవరించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. నియోజకవర్గాల వారీగా అదనపు ఓటర్లను గుర్తించి, వారిని సంబంధిత గ్రామ పంచాయతీలు, పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా వర్గీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ డేటాలో ఏవైనా లోపాలుంటే ఈ నెల 23వ తేదీలోగా నివేదించాలని, ఆ తర్వాత ముసాయిదా జాబితా విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేసింది. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. గతంలో 2019 మే నెలలో ఈ ఎన్నికలు మూడు దశల్లో జరిగాయి. ప్రజాప్రతినిధుల పదవీకాలం గతేడాది జూన్‌తో ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వాస్తవానికి గతేడాది సెప్టెంబరులోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో నెలకొన్న న్యాయపరమైన చిక్కులతో నిలిచిపోయింది. ఇటీవల హైకోర్టు అనుమతి ఇవ్వడంతో రిజర్వేషన్ల ఖరారు పూర్తి చేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, రాష్ట్రంలో పెరిగిన పట్టణీకరణ కారణంగా గతంతో పోలిస్తే స్థానాల సంఖ్యలో మార్పులు చోటుచేసుకున్నాయి. పలు గ్రామ పంచాయతీలు సమీప పురపాలికల్లో విలీనం కావడంతో ఈసారి 44 ఎంపీటీసీ, 4 జడ్పీటీసీ స్థానాలు తగ్గాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 566 జడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని పంచాయతీరాజ్ శాఖ నివేదిక వెల్లడించింది. ఈ ఎన్నికలు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ.. ఇదే ఊపును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు తమ బలాన్ని నిరూపించుకోవాలని బీఆర్ఎస్, బీజేపీలు సైతం వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఓటర్ల జాబితా ఖరారైన వెంటనే బ్యాలెట్ బాక్సుల తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి పనులు ప్రారంభం కానున్నాయి.

## ఎన్డీయేకు చీకటి రోజు.. వారికి తొలి ఓటమి

మొదటి పేజి తరువాయి

ఇది డీలిమిటేషన్, మహిళల హక్కుల కోసం తీసుకొచ్చిన బిల్లు కాదన్నారు. విపక్షాలన్నీ ఏకతాటి పైకి వచ్చి ప్రభుత్వాన్ని ఓడించాయని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమని పేర్కొన్నారు. ఎన్డీయేకు ఇది చీకటి రోజు అని, వారు తీసుకొచ్చిన బిల్లు తొలిసారిగా లోక్‌సభలో ఓడిపోయిందని విమర్శించారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుల విషయంలో ఫలితంతో సంబంధం లేకుండా తమకే ఘనత దక్కేలా అధికారపక్షం ఎత్తుగడ వేసిందని దుయ్యబట్టారు. "బిల్లు ఆమోదం పొందినా.. పొందకపోయినా అది తమకు విజయమేనని వారు విశ్వసించారు. మహిళల హక్కుల కోసం పోరాడేది తామేనని నమ్మించాలనుకున్నారు. కానీ అది అంత సులభం కాదు" అని ప్రియాంక అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపెట్టడాన్ని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం పేరిట వ్యవస్థలపై ఏమాత్రం గౌరవం లేకుండా అధికారపక్షం వ్యవహరించిన తీరును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయన్నారు. "ఇది ప్రభుత్వానికి ఎదురుదెబ్బ. ఆ కూటమి కుదుపునకు లోనయింది" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కేంద్రానికి సవాలు విసిరారు. "2023లో ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకురండి. అందుకోసం సోమవారం పార్లమెంట్ సమావేశాలు నిర్వహించండి. దానికి మా పూర్తి మద్దతు తప్పకుండా ఉంటుంది. అప్పుడు తెలుస్తుంది.. మహిళా వ్యతిరేకులు ఎవరో" అని ప్రియాంక పేర్కొన్నారు.

## బుధవారమే డెడ్‌లైన్.. ఒప్పందం
# కుదరకుంటే మళ్లీ బాంబుల

మొదటి పేజి తరువాయి

హమాస్, హిజ్బుల్లా వంటి సంస్థలకు నిధులు ఆపడానికి, అణు కార్యక్రమాన్ని నిరవధికంగా నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని శుద్ధిచేసిన యురేనియం నిల్వలను కూడా అమెరికాకు తరలించడానికి ఒప్పుకుందని ఆయన ప్రకటించారు. ఒప్పందం పూర్తయ్యే వరకు ఇరాన్‌పై నావికాదళ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. అమెరికా అధ్యక్షుడు చెప్పిన ఏడు విషయాలూ అబద్ధాలేనని ఇరాన్ ప్రధాన రాయబారి మొహమ్మద్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. "శుద్ధిచేసిన యురేనియం మాకు ఇరాన్ గడ్డతో సమానం. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికాకు తరలించే ప్రసక్తే లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ మంగళవారంతో ముగియనుండగా, ట్రంప్ విధించిన బుధవారం గడువుతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తదుపరి చర్చలు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# "మన భూమి, మన పంట, మన వంటకు చేయూత ఇవ్వండి

అమరావతి: "మన భూమి, మన పంట, మన వంటకు చేయూత ఇవ్వండి. రైతు సొసైటీలకు జాతీయ రహదారుల వెంట ఐదెకరాలు లీజుపై కేటాయించండి. అక్కడ 'తెలుగుదనం' పేరుతో 600 రకాల ఆంధ్ర వంటకాలను పరిచయం చేస్తాం. అమ్మమ్మ, నానమ్మల చేతివంట రుచి చూపిస్తాం' అని సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయ్‌రామ్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతుబజార్, శిల్పారామాల ఏర్పాటుతో మన వ్యవసాయం, మన సంస్కృతికి చంద్రబాబు ఎంతో చేయూత అందించారని, అదే తరహాలో 'తెలుగుదనం' వేదికల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాల్ని అందిపుచ్చుకోవాలని తొలిసారి సూచించింది చంద్రబాబే అని పేర్కొన్నారు. చిత్తూరుకు చెందిన ప్రవాసాంధ్రురాలు ఝాన్సీలక్ష్మీబాయి, విజయ్‌రామ్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదనలు వివరించారు. తెలుగుదనం వేదికలతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం సమీపంలోని తరకటూరు వ్యవసాయ క్షేత్రంలో పండించిన 35 రకాల ఉత్పత్తుల్ని చంద్రబాబుకు అందజేశారు. ఈ క్షేత్రాన్ని సందర్శిస్తానని సీఎం హామీ ఇచ్చారని విజయ్‌రామ్ తెలిపారు.

విశాఖలో మన వంటకు విశేష ఆదరణ

"విశాఖపట్నంలో రెండేళ్లపాటు 'భోజన పండగ' నిర్వహించి వివిధ రకాల వంటకాలను పరిచయం చేశాం. దీనికి విశేష స్పందన వచ్చింది. ఏప్రిల్ 1 నుంచి 5 వరకు 'సబల' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి 50వేల మంది వచ్చారు. మన వంటల్ని ప్రజలు కోరుకుంటున్నారనేందుకు ఇదే నిదర్శనం" అని విజయ్‌రామ్ తెలిపారు. 'తెలుగుదనం' వేదికల ప్రణాళికలను వివరిస్తూ.. తెలుగువారికే ప్రత్యేకమైన సుమారు 600 వంటకాల తయారీని ఆ వేదికలపై నేర్పిస్తామన్నారు. 'ఏ కాలంలో ఏం తినాలో తెలియజేస్తాం. మిఠాయిలు, పచ్చళ్లు, ఎద్దు గానుగ నూనెల తయారీ, మట్టి బొమ్మలు, కుండలు చేయడం, బుట్టలు, తాటి మంచాల అల్లికపై శిక్షణ ఇస్తాం. జానపదాలు, తెలుగు పద్యాలు, మహనీయుల వీరగాథలు తెలుసుకునేలా వేదికలు తీర్చిదిద్దుతాం. గో ఆధారిత వ్యవసాయంపై నిరంతర శిక్షణ, వాన నీటి సంరక్షణ, దేశీయ విత్తన నిధి, దేశవాళీ ఆవుల పెంపకం, పాడి పరిశ్రమ నమూనాల్ని తెలియజేస్తాం' అని తెలిపారు.

ముఖ్య కార్యక్రమాలన్నీ అక్కడే

'జిల్లా పరిధిలో నిర్వహించే ముఖ్య కార్యక్రమాల్ని ఆ వేదికలపైనే చేసుకునేలా ఏర్పాట్లు చేస్తాం. పెళ్లి చూపులు, పర్యావరణహిత వివాహాలు, సీమంతాలు, ఉయ్యాల పండగలు, పుట్టినరోజు వేడుకలు, పదవీ విరమణ వేడుకలూ చేసుకోవచ్చు. ప్రతి జిల్లాలో వేదికను ఐఏఎస్ అధికారి పర్యవేక్షించేలా చూడాలి' అని విజయ్‌రామ్ వివరించారు.

# భారతదేశ చరిత్రలో మరపురాని దినం

హైదరాబాద్: లోక్‌సభలో రాజ్యాంగ సవరణ నల్ల బిల్లును ఓడించడానికి రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్ష నాయకులంతా ఏకమై జాతీయ విపత్తును నివారించిన ఈ రోజు(శుక్రవారం).. భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మరపురాని దినమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంటులో ఏకమైన ప్రజాస్వామ్య శక్తులకు, వివిధ పార్టీల నాయకులకు ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపారు. స్టాలిన్, మమతాబెనర్జీ, అఖిలేష్‌యాదవ్, శరద్‌పవార్, ఉద్ధవ్‌ఠాక్రే, లాలూప్రసాద్‌యాదవ్, హేమంత్‌సోరెన్, ఫరూఖ్‌అబ్దుల్లా, నవీన్‌పట్నాయక్, అరవింద్ కేజ్రీవాల్, కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఈ పోరాటంలో ఐకమత్యంతో, సాహసంతో నిలిచారని ఆయన వివరించారు.

దక్షిణాదికి నష్టమని గొంతెత్తి...

నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో చేసిన ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాదని ఆది నుంచి భాజపా వైఖరిని రేవంత్‌రెడ్డి తప్పుపట్టిన సంగతి తెలిసిందే. లోక్‌సభ సీట్లను పెంచే పద్ధతి దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేస్తుందని, దీనికి వ్యతిరేకంగా నిలబడాలని తమిళనాడు, కర్ణాటక, ఏపీ ముఖ్యమంత్రులు ఎం.కె. స్టాలిన్, సిద్ధరామయ్య, చంద్రబాబుకు ముందే ఆయన లేఖలు రాశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను కలిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆ లేఖలలో వివరించారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకునే రాష్ట్రాలు నష్టపోతూ, జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లాభపడే పరిస్థితి వస్తుందని సీఎం చేసిన వాదన జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా హైబ్రిడ్ మోడల్‌ను పరిశీలించాలని, ఈ అంశంపై రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

అప్పుడే ప్రధాని మోదీకీ లేఖ...

నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కూడా రేవంత్‌రెడ్డి ముందే లేఖ రాశారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అందులో కోరారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు, ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం కలిగించే అంశమైనందున బాధ్యతతో అత్యవసరంగా ఈ లేఖ రాసినట్లు అప్పుడే తెలిపారు.

మహిళా రిజర్వేషన్లు ప్రజాస్వామ్యానికి నైతిక అవసరం

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని బిల్లులను ప్రవేశపెట్టడానికి ముందే సీఎం రేవంత్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలో, అసెంబ్లీల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యానికి ఒక నైతిక అవసరమని చెప్పారు. జనాభా లేదా ప్రోరేటా పద్ధతిలో లోక్‌సభ సీట్ల పెంపు ప్రతిపాదనను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించబోవని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధిలో పాలుపంచుకున్న రాష్ట్రాలకు శిక్ష కాకూడదని...

1970ల నుంచి రాష్ట్రాల వారీగా జనాభా నియంత్రణ అమలు జరిగిన తీరు భిన్నంగా ఉందని, రాష్ట్రాలకు ఆర్థిక సహకారం, సామాజిక, మానవ అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రోరేటా పద్ధతిలో సీట్లు పెంచితే దేశ సమాఖ్య వ్యవస్థలో సమతౌల్యం దెబ్బతింటుందని సీఎం రేవంత్ వాదించారు. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు దశాబ్దాలుగా జనాభా స్థిరీకరణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయని.. కానీ బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందుతుంటే, తెలంగాణకు తక్కువ నిధులు వస్తున్నాయని, ఇది దక్షిణాది-ఉత్తరాది అసమానతకు సంకేతమని వివరించారు. నిధుల వివక్షకు అదనంగా ఇప్పుడు సీట్ల పెంపు కారణంగా రాజకీయంగా అన్యాయం జరుగుతుందని బిల్లులను వ్యతిరేకిస్తున్నట్లు ఆయన అప్పుడే తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా సహకరించినప్పటికీ, పార్లమెంట్‌లో వారి ప్రాధాన్యం తగ్గిపోతుందని, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తరాది, మధ్య ప్రాంత రాష్ట్రాలు లాభపడతాయని తెలిపారు. అభివృద్ధిలో పాలుపంచుకున్న రాష్ట్రాలకు శిక్ష పడుతుందని, జనాభా పెరిగిన రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా ఉంటుందని ఇది అంకెల విషయం కాదని, దేశ సమగ్రత, సమానత్వం, న్యాయానికి సంబంధించిన ప్రాథమిక అంశమని ఆయన నొక్కిచెప్పారు.

## భాజపా నాటకాన్ని దేశ ప్రజలు చూశారు

హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల బిల్లు పేరుతో భాజపా ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు చూశారని భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. భారాస సహా అన్ని రాజకీయ పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలంగా ఉన్నప్పటికీ భాజపా రాజకీయాలతోనే వీగిపోయిందన్నారు. ఈ మేరకు కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. "మహిళా బిల్లు వైఫల్యానికి భాజపానే కారణం. డీలిమిటేషన్ అంశాన్ని అనవసరంగా జోడించి క్లిష్టతరం చేయడంతోనే బిల్లు నిలిచిపోయింది. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాలతోనే రిజర్వేషన్లు అమలు చేయవచ్చు. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం సమస్యలు సృష్టించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని అనేక పార్టీలు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ అంశాన్ని పట్టించుకోకుండా కేంద్రం ముందుకు వెళ్లడంతో చారిత్రక అవకాశం కోల్పోయాం. డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా కొత్తగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలి' అని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం అసెంబ్లీ సీట్ల పెంపు రాష్ట్ర హక్కు అని అన్నారు. జమ్మూకశ్మీర్, అస్సాంలో సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం... తెలంగాణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. 2028లోపు సీట్ల పెంపునకు ప్రత్యేక బిల్లు తీసుకురావాలన్నారు.

## 'రప్పా రప్పా నరకడం', 'రక్తాభిషేకాలు చేయడం' వారి సంస్కృతి

అమరావతి: 'జగన్ ఇంట్లో ఉంటే ఆయన ఇంటి వరకే నష్టం.. కానీ ఆయన రాజకీయాల్లో ఉంటే రాష్ట్రానికి నష్టం. వైకాపా నాయకులు పొట్టేళ్లను నరికి రక్తాభిషేకాలు చేస్తున్నారు, అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరుకుతాం అని పోస్టర్లు పెడుతున్నారు. ఇదీ వాళ్ల సంస్కృతి' అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. వైకాపా అరాచకాలు, దుర్మార్గాల్ని ప్రజలకు వివరించాలని సూచించారు. పనితీరు ప్రాతిపదికగా ఒక మండలాధ్యక్షురాలిని, క్లస్టర్ ఇన్‌ఛార్జిని పార్టీలో అత్యున్నతమైన పొలిట్‌బ్యూరోలోకి తీసుకున్నామని వివరించారు. 'కార్యకర్తే అధినేత' అన్న విధానానికి ఇదే నిదర్శనమన్నారు. 'పని చేసేవారికి గౌరవం, గుర్తింపు తప్పకుండా లభిస్తుంది. ఎన్నికలకు ముందు పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలు, ఎన్నికల మ్యానిఫెస్టోను మీరు ఇంటింటికీ తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చాక ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఆ హామీల్ని అమలు చేశాం. గతంలో కంటే రెట్టింపు సంక్షేమం అమలు చేస్తున్నాం. వీటికి కార్యకర్తలు ఓనర్‌షిప్ తీసుకోవాలి. ప్రభుత్వం ఏ పని చేసినా దాని ఫలితం పార్టీకే దక్కుతుంది' అని చంద్రబాబు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజామోదం ఉన్నవారికే టికెట్లు ఇచ్చామని గుర్తుచేశారు. ఐవీఆర్ఎస్ ద్వారా మీ అభిప్రాయం తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశాం.. ఫలానా వాళ్లు గెలవరనుకుంటే నాకు సన్నిహితంగా ఉన్నా సరే టికెట్ ఇవ్వలేదని చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి నాయకత్వానికి చంద్రబాబు పిలుపునిచ్చారు. 'వివిధ సర్వేల ద్వారా ప్రజాప్రతినిధుల పనితీరు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు గురించి తెలుసుకుంటున్నాను. నాయకులు ప్రజలకు నష్టం కలిగించే పనులు చేసినా, కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గినా పార్టీకి నష్టం. బలమున్న నియోజకవర్గాన్ని అసమర్థ నాయకుడి చేతిలో పెడితే ఓటమి ఖాయం. మంచి నాయకుణ్ని బలహీన నియోజకవర్గానికి పంపిస్తే పార్టీ గెలుస్తుంది. కార్యకర్తలు నిత్య విద్యార్థుల్లా ఉండాలి. జీవితాంతం నేర్చుకోవాలి. శిక్షణలో నేర్చుకున్న అంశాల్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. కార్యకర్తల సంక్షేమం చూస్తాం: 'క్యాడర్‌ను పట్టించుకునే పార్టీ తెదేపా. అందుకే పార్టీ కోసం ప్రాణాలర్పించిన, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యకర్తల పిల్లల్ని చదివిస్తున్నాం. వీలైనంత మంది కార్యకర్తల్ని ఈ-3 (ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) ద్వారా ఆర్థికంగా పైకి తీసుకొస్తాం' అని చెప్పారు. 'రాష్ట్రమంతటా మే 15కే పంటలకు నీళ్లివ్వబోతున్నాం. జలధార కార్యక్రమంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి' అని సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారుల్ని ఆదేశించారు.

## 'ఇంతకు తెగిస్తారా?'.. నిర్మలపై మమత ఫైర్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఎన్నికల సంగ్రామం అనూహ్య మలుపులు తిరుగుతూ మరింత వేడెక్కింది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు రాజకీయ పార్టీలు వేస్తున్న ఎత్తుగడలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ) ఉల్లంఘించి, మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసేలా వ్యవహరిస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ)డిమాండ్ చేయడం ఆసక్తికరంగా మారింది.

తాజాగా బీజేపీ నేతలు పంపిణీ చేసిన 'మాతృశక్తి గ్యారెంటీ కార్డుల' చుట్టూనే ఇప్పుడు కొత్త రాజకీయ వివాదం నడుస్తోంది. ఈ కార్డుల ద్వారా మహిళా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.3,000 జమ చేస్తామని బీజేపీ పరోక్షంగా హామీ ఇస్తోంది. ఎన్నికల సమయంలో ఇలాంటి ఆర్థిక ప్రయోజనాలను ప్రకటించడాన్ని మమతా బెనర్జీ తప్పుబట్టారు. ఇది ప్రజాస్వామ్య నిబంధనలను అపహాస్యం చేస్తూ, ఓటర్లకు బహిరంగంగా లంచం ఇవ్వడమేనని ఆమె మండిపడ్డారు. పోలింగ్‌కు ముందే ఆదరాబాదరాగా కొత్త ఖాతాలు ఎందుకు తెరుస్తున్నారని, ఇదంతా మహిళా ఓటర్లను ప్రలోభపెట్టే ఓటు బ్యాంకు జిమ్మిక్కు మాత్రమేనని ఆమె ఆరోపించారు.

ఈసీ నిష్పాక్షికతపై దీదీ ప్రశ్నల వర్షం

ఈ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును కూడా ముఖ్యమంత్రి తప్పుబట్టారు. ఈసీ కేవలం ప్రతిపక్షాలపై మాత్రమే ఉక్కుపాదం మోపుతోందని, అధికార బీజేపీ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తే ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆమె ప్రశ్నించారు. అందరికీ చట్టం సమానమే అయినప్పుడు, బీజేపీ నేతలపై వచ్చిన ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ప్రధాని పదవిపై తనకు అపార గౌరవం ఉందని, అయితే ప్రజలను ఇలా బహిరంగంగా తప్పుదోవ పట్టిస్తుంటే తాను మౌనంగా ప్రేక్షకపాత్ర పోషించలేనని మమత అన్నారు. ఆర్థిక మంత్రిపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉత్కంఠ రేపుతోన్న బెంగాల్ పోరు

రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ఒక కేంద్ర మంత్రిపై ఆరోపణలు చేయడంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే తమవి కేవలం మహిళా సాధికారతకు సంబంధించిన పరిపాలనా పరమైన హామీలే తప్ప, ఎలాంటి ఎన్నికల ప్రలోభాలు కావని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సరికొత్త వివాదం ఓటర్ల మనోభావాలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ రాజకీయ పోరులో అందరి దృష్టి ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయం మీదే నిలిచింది.

## తమిళనాడు లో జరుగనున్న ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీతో కలిసి పర్యటిస్తున్న మధుయాష్కీ గౌడ్.



హైదరాబాద్ ఏప్రిల్ 18 భారత జ్యోతి ప్రతినిధి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆ రాష్ట్రంలోని రాణిపేట జిల్లా షోలింగూర్ నియోజకవర్గం పండియానల్లూర్ లో నిర్వహించిన ఎన్నికల సభలో లోక్సభలో ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ





ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క టీఎన్ సీసీ అధ్యక్షులు సెల్వ పెరుంతగై ఏఐసీసీ సీనియర్ పరిశీలకులు ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్ షోలింగూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మునిరత్నం తదితరులతో కలిసి హాజరయ్యారు. కాగా షోలింగూర్ నియోజకవర్గ ఏఐసీసీ పరిశీలకులుగా మధుయాష్కి నిన్నటి నుంచి రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లు, జన సమీకరణ తదితర విషయాలను పర్యవేక్షించారు.

## వేసవిలో తాగు నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



తనకల్లు ఏప్రిల్ 18(భారత జ్యోతి): తనకల్లు మండల పరిధిలోని మండ్లిపల్లి గ్రామంలో వేసవి సందర్భంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్,దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణం స్పందించి ఎంపీడీవో రామానాయక్,కు ఆదేశాలు జారీ చేయగా శనివారం తనసిబ్బందితో గ్రామాన్ని సందర్శించి తాగునీటి బోరు పైపులు, మోటారు,ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ:- బోరు వేసిచాలా కాలమైనా అలాగే ఉండిపోయిందని,ఈ వేసవిలో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడగా ప్రస్తుత శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, స్పందించి అధికారులను పంపి తాగునీటి సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే కి,ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామానాయక్, కార్యాలయం సిబ్బంది గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వాడని ఖాతా.. 'బతికిందిలే!'

బ్యాంకు పొదుపు ఖాతాలో లావాదేవీలు పదేళ్లుగా నిలిచిపోయాయా.. వాడుకలోలేని ఖాతాగా బ్యాంకు నిర్ణయించి అందులోని మొత్తాలు ఆర్బీఐకి బదిలీ చేసిందా.. డబ్బు వెనక్కి రాలేదని, అవి ఎలా వస్తాయని చింతిస్తున్నారా.. అలాంటి ఖాతాల కోసం ఆర్బీఐ కొత్తగా ఓ పథకాన్ని ప్రకటించింది. దీంతో నిలిచిపోయిన ఖాతాతోపాటు అందులోని డబ్బు కూడా వెనక్కి వచ్చేస్తుంది. దేశంలో 2025 జూన్ నాటికి భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.67,000 కోట్లకుపైగా క్లెయిమ్ చేయని మొత్తాలు పొదుపు ఖాతాల్లో ఉన్నట్లుగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల ప్రకటించింది. పదేళ్లకు పైగా నిరుపయోగంగా ఉన్న ఖాతాల్లోని మొత్తాన్ని బ్యాంకులు ఆర్బీఐకు బదిలీచేస్తాయి. ఈ డిపాజిట్ల చెల్లింపులను సులభతరం చేసేందుకు ఈ ఏడాది అక్టోబరు 1న కొత్త పథకాన్ని ప్రారంభించింది. 2026 సెప్టెంబరు 30 వరకు ఇది అమలులో ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో పెద్దసంఖ్యలో నిరుపయోగంగా ఉన్న బ్యాంకు ఖాతాలను తెరిచి వాటిలో మొత్తాలు తిరిగి పొందేందుకు ప్రజలకు ఇది చక్కని అవకాశం. వ్యక్తిగతంగా, సంస్థల పేర్లతో ఉన్న ఖాతాలు తిరిగి తెరవొచ్చు.

మీ ధనం మీ హక్కు..

అవగాహన లేక దీర్ఘకాలం నుంచి క్లెయిమ్ చేయని బీమా పాలసీలు, బ్యాంకు డిపాజిట్లు, డెవిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ రాబడులతో సహా గడువు ముగిసిన ఖాతాల్లోని మొత్తాన్ని తిరిగి పొందేలా కేంద్రం ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'మీ ధనం మీ హక్కు' పేరుతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించిన ఈ అవగాహన కార్యక్రమం మూడు నెలలు (అక్టోబరు నుంచి డిసెంబరు) దాకా కొనసాగుతుంది. లావాదేవీలు నిలిచిపోయిన పొదుపు ఖాతాలను నిర్దేశించిన కాల వ్యవధి తరువాత బ్యాంకులు పక్కన పెట్టి వాటిలో మొత్తాలను ఆర్బీఐకి పంపుతాయి. ఇలాంటి మొత్తాలు ఆర్బీఐ ఆధ్వర్యంలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్, అవేర్నెస్ (డీఈఏ) నిధికి జమవుతాయి. ఖాతాల నిర్వహణ, ఇతర అనేక అంశాలపై ఖాతాదారుల్లో అవగాహన కల్పించేందుకు నిధులు ఖర్చు చేస్తారు. దేశవ్యాప్తంగా క్లెయిమ్ చేయని ఇలాంటి మొత్తాలు ఆర్బీఐ వద్ద రూ.వేల కోట్లకు చేరుకోవడంతో సులభతర విధానంలో ఖాతాదారులు తిరిగి పొందేలా ఏర్పాట్లు చేశారు.

పోర్టల్లో వివరాలు తెలుసుకోవచ్చు...

లావాదేవీలు నిలిచిపోయిన పొదుపు ఖాతాల వివరాలు ఖాతాదారులు కూడా తెలుసుకునేందుకు ఉద్గం (యూడీజీఏఎం) పేరుతో ఆర్బీఐ పోర్టల్ ప్రారంభించింది. ఖాతాదారులు https://udgam.rbi.org.in పోర్టల్లోవారి పేరు, మొబైల్ నంబరుతో రిజిస్టర్ అవ్వాలి. తదుపరి మరిన్ని వివరాలు అప్లోడ్ చేసి పలు బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని మొత్తాల వివరాలు తెలుసుకోవచ్చు. 2024 మార్చి 4 నాటికి 30 బ్యాంకుల వివరాలను పోర్టల్లో అప్లోడ్ చేశారు. ఖాతాల వివరాలు తెలుసుకోవడానికే పోర్టల్ ఉపయోగపడుతుంది. ఖాతా తిరిగి వినియోగంలోకి వచ్చి, అందులోని మొత్తాలు తిరిగి తీసుకోవాలంటే సంబంధిత బ్యాంకు బ్రాంచికి వెళ్లాల్సిందే.

బ్యాంకులకూ ప్రోత్సాహకాలు

4-10 ఏళ్లుగా వాడుకలోని పొదుపు ఖాతాలు తిరిగి తెరిపించేందుకు కృషి చేసే బ్యాంకులకు ఆర్బీఐ ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఖాతాల నిరుపయోగ కాలపరిమితిని బట్టి ప్రోత్సాహక రుసుం కూడా మారనుంది. బ్యాంకు సిబ్బంది తమ పరిధిలోని ఖాతాలను గుర్తించి సంబంధిత చిరునామాకు వెళ్లి ఖాతాదారులు, వారి వారసుల నుంచి అవసరమైన వివరాలు, పత్రాలు సేకరించి ఖాతాలు తిరిగి తెరవాలి.

## అమెరికా ఆంక్షల ఎఫెక్ట్.. భారత్కు భారీ డిస్కౌంట్తో రష్యన్ ఆయిల్!

: రష్యా చమురువ్యాపారంలో అమెరికా ఆంక్షలు కొత్త మార్పులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్నెఫ్ట్ , లుకోయిల్లపై ఆంక్షలు అమల్లోకి రావటంతో క్రూడాయిల్ ధరలు రికార్డు స్థాయిలో తగ్గాయి. దీంతో భారత్కు చమురు సరఫరా చేసే విధానం మారింది. ఇది మన రిఫైనరీలకు భారీ లాభాలను అందించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారత్కు సరఫరా అయ్యే ముడిచమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి. రాస్నెఫ్ట్, లుకోయిల్లపై అమెరికా ఆంక్షలు విధించాక లాభదాయకంగా ఉన్న అక్కడి చమురు వ్యాపారం తారుమారైంది. ప్రస్తుతం రష్యా ప్రధాన చమురు అయిన ఉరల్స్ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు ధర కంటే బ్యారెల్కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించడానికి సిద్ధమయ్యారు. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు కేవలం మూడు డాలర్లుగా ఉండేది. ఈ కొత్త ఆఫర్ డిసెంబరులో లోడ్ చేసి, జనవరిలో భారత్కు చేరే చమురుకు వర్తిస్తుంది. 2022లో ఉక్రెయిన్పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ భారీగా కొనుగోలు చేస్తూ వచ్చింది. కానీ, నవంబర్ 21 నుంచి ఆంక్షలు అమల్లోకి రావటంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. అయితే, ఈ వారంలో ఉరల్స్ చమురు ధర బాగా తగ్గడంతో భారత రిఫైనరీల వైఖరి మారింది.

# వెనక్కి తగ్గిన 'సాథీ'!

ఉద్దేశాలు మంచివైనప్పుడు దాపరికాలు అవసరం లేదు. జనానికి మేలు చేయటమే ధ్యేయమైనప్పుడు చాటుమాటు చర్యలు సరికాదు. రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్ మూణె?ల్లలో ఫోన్లలో ఉండితీరాలంటూ కేంద్రం మొబైల్ ఉత్పత్తిదారులకు మొన్న శుక్రవారం చడీచప్పుడూ లేకుండా ఇచ్చిన ఆదేశాలు తీవ్ర వివాదాస్పదం కావటం ఇందువల్లే. మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన విమర్శలకు జడిసి ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ఇక్కడ ఉత్పత్తవుతున్న, దిగుమతవుతున్న ఫోన్లకు వర్తించటంతోపాటు ఇప్పటికే వినియోగదారుల దగ్గరున్న ఫోన్లకు సాఫ్ట్వేర్ ద్వారా ఈ యాప్ను చేరేయాలని టెలికమ్యూనికేషన్ల విభాగం మూడు రోజుల క్రితం మొబైల్ ఉత్పత్తిదారుల్ని ఆదేశించింది. తాజాగా అది తప్పనిసరి కాదంటూ ప్రకటించింది. పౌరుల శ్రేయస్సును ఆశించి, వారు మోసగాళ్ల బారిన పడకుండా చూసేందుకు ఇది రూపొందించామనీ, ఇందులో గూఢచర్యం లేదా ఫోన్ సంభాషణల పర్యవేక్షణ ఉద్దేశం లేనేలేవనీ కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సంజాయిషీ ఇచ్చారు. దాదాపు కోటిన్నరమంది దీన్ని డౌన్లోడ్ చేసుకుని లబ్ధి పొందుతున్నారనీ, 41 లక్షల మోసపూరిత మొబైల్ నంబర్లను గుర్తించి నిరోధించామనీ, అపహరించిన దాదాపు 26 లక్షల మొబైల్ సెట్ల జాడ కనిపెట్టి 7 లక్షల సెట్లను వాటి యజమానులకు అందించా మనీ సింధియా చెబుతున్నారు. ఈ గణాంకాలతో విభేదించాల్సిన అవసరం లేదు. కానీ యాప్ ద్వారా ప్రయోజనాలు వెల్లువెత్తుతుంటే ఆ మాటే చెప్పి, మరింతమందిని ప్రోత్స హించవచ్చు. తదుపరి చర్యలు అవసరమనుకుంటే వెల్లడించవచ్చు. ఇదేం లేకుండా రహస్య చర్య ఆంతర్యమేమిటి? దాదాపు నలభయ్యేళ్ల క్రితం అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ 'పోస్టల్ బిల్లు' తీసుకొచ్చి నప్పుడు జరిగిందేమిటో పాలకులు గ్రహించివుంటే వ్యక్తిగత గోప్యతను పౌరులు ఎంత ప్రాణప్రదంగా పరిగణిస్తారో అర్థమై ఉండేది. కనీవినీ ఎరుగని స్థాయిలో 400 స్థానాలకు పైగా కైవసం చేసుకుని, తిరుగులేదనుకున్నవేళ పౌరులకు తెలియకుండా వారి ఉత్తరా లను చదివేందుకుద్దేశించిన బిల్లు తీసుకొచ్చి ఆయన అభాసుపాలయ్యారు. జస్టిస్ పుట్టస్వామి కేసులో 2017లో సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుల్లో చేర్చింది. జాతీయ భద్రత లేదా సముచిత ప్రజాప్రయోజనం ఉన్నదని






ప్రభుత్వం భావిస్తే గోప్యత నియంత్రణకు తగిన చట్టం తీసుకురావొచ్చని స్పష్టం చేసింది. అప్పుడు ప్రజల్లో, పార్లమెంటులో విస్త ృత చర్చ జరుగుతుంది. ఇవేమీ లేకుండా ఒక నోటీసు ద్వారా పనికానిచ్చేద్దామనుకోవటం ప్రజాస్వామ్యంలో చెల్లుబాటవుతుందా? అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినా మన దగ్గర డిజిటల్ వినియోగం బాగా పెరిగింది. క్రయవిక్రయాలు, చెల్లింపులు, వసూళ్లు, ఆన్లైన్ నమోదులు ముమ్మర మయ్యాయి. వాటితోపాటే సైబర్ నేరాలు ఎక్కువయ్యాయి. డిజిటల్ అరెస్టు పేరుతో మోసగాళ్లు కోట్లు కాజేస్తున్నారు. ఆ నేరగాళ్లను పట్టుకోవటానికీ, పోగొట్టుకున్న ఫోన్లు పొందేందుకూ 'సంచార్ సాథీ' తోడ్పడటం నిజమే కావొచ్చు. కానీ గుప్పెడుమంది నేరగాళ్లను పట్టుకోవడానికి కోట్లాదిమందిని నిఘా నీడలోకి తెస్తామనటం ఏం తర్కం? ఉత్పత్తిదారులకు తప్పనిసరంటూ ఆదేశాలిచ్చి,

ఇష్టపడకపోతే వినియోగదారులు తొలగించుకోవచ్చని చెప్పడంలో మర్మమేమిటి? వ్యక్తిగత గోప్యత విషయంలో పౌరులకు ఎంత పట్టింపు ఉంటుందో నిత్యజీవితంలో చూస్తుంటాం. తల్లిదండ్రులు తమ ఫోన్లు గమనిస్తున్నారంటే పిల్లలకు కోపం. ప్రాణ స్నేహితుడైనా చాటుగా ఫోన్ చూస్తే సహించరు. భార్యాభర్తలే ఒకరి ఫోన్లు మరొకరు చూశారని తెలిస్తే దుమ్మెత్తిపోసుకుంటారు. అలాంటిది ప్రభుత్వ నిఘాకు అవకాశమిచ్చే యాప్ను జనం అంగీకరించగలరా? కాల్స్ వినేందుకూ, ఎస్సెమ్మెస్లు, ఫోన్ నంబర్లు, ఫొటోలు వగైరాలన్నిటినీ చూసేందుకూ... ఆఖరికి మనకు తెలియకుండా కెమెరా వినియోగానికి కూడా ఈ యాప్ అవకాశమిస్తుందన్నది నిపుణుల మాట. బహుశా '1984' రచయిత జార్జి ఆర్వెల్ కూడా ఇంత చేటు నిఘా ఊహించలేదు. ఏదేమైనా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అది వివేకవంతమైన చర్య.

# ఆత్మనిగ్రహం... ఆత్మస్థైర్యం

మనస్సు చంచలమైనది. అది నిరంతరం ఏదో ఒక దానిగురించి ఆలోచిస్తూ ఉంటుంది. అలాంటి మనస్సును స్వేఛగా వదిలేస్తే ఇంద్రియాలకు అధీనమైపోతుంది. కామక్రోధాదులను బలపరుస్తుంది. అహంకార మమకారాలను వ ృద్ధి చేస్తుంది. ఈ క్రమంలో ఇంద్రియాలకు లాలసుడైన మనిషి విచక్షణను కోల్పోయి క్షణిక సుఖాలకు దగ్గర అవుతాడు. దీంతో అభివ ృద్ధి నిలిచిపోయి అథఃపాతాళంలోకి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే మనస్సును ఎప్పటికప్పుడు నిగ్రహించుకుంటూ ఇంద్రియ వశం కాకుండా మంచి పనులు మాత్రమే చేయాలనే నిబద్ధతతో మనస్సును అధీనంలో ఉంచుకోవడమే ఆత్మ నిగ్రహం. చంచలమైన మనస్సును నిశ్చలంగా చేయడం సాధారణమైన విషయం కాదు. సామాన్యులకే కాదు, అత్యంత శూరుడైన అర్జునికి కూడా మనస్సును నిగ్రహించుకోవడం సాధ్యం కాలేదు. మనసును నిగ్రహించడం వాయువును బంధించడం కన్నా కష్టమైందని అర్జునుడే స్వయంగా అన్నాడు. భారత యుద్ధం ప్రారంభం కావడానికి ముందు తనకు సారధ్యం వహిస్తున్న శ్రీ క ృష?నితో అర్జునుడు ఈ మాటలు పలికాడు. యుద్ధంలో ప్రతిపక్షం మీద ద ృష్టి సారించి తన తాత భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు, సహాధ్యాయ గురుపుత్రుడు అశ్వత్థామ, అన్నదమ్ములైన కౌరవ సోదరులను చూసి విషాదంలో పడి పోయాడు. వారంతా తన స్వజనం కావడంతో యుద్ధం చేయడానికి అతనికి మనస్కరించలేదు. దాంతో అతని చేతిలో నుంచి ధనస్సును జార విడుస్తూ "క ృషా? నాకు విజయం వద్దు... రాజ్య సుఖాలు వద్దు... ఆచార్యుణి?, పితామహుణి?, బంధువులను నేను సంహరించలేను" అంటూ మౌనం వహించి విముఖుడై కూర్చుండిపోయాడు. అతని మనస్సు నిగ్రహాన్ని కోల్పోయింది. అందువల్లనే అర్జునికి ఇలాంటి స్థితి ఏర్పడింది. ఇది గమనించిన శ్రీ క ృష?డు అర్జునుణి? యుద్ధానికి సన్నద్ధం చేయడానికి ఎంతో శ్రమ పడాల్సి వచ్చింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 18 అధ్యాయాలుగా ఉండే భగవద్గీతను బోధించాడు. భౌతికమైనవి, తాత్వికమైనవి అనేకానేక విషయాలు తాను గురువుగా మారి అర్జునునికి బోధించాడు.




దాంతో అర్జునుడు శత్రువులను సంహరించడానికి అంగీకరించాడు. మనోనిగ్రహం పొందడం చేతనే అర్జునుడు తిరిగి మామూలు స్థితికి వచ్చాడు. తన ధర్మాన్ని తాను నిర్వర్తించాడు. దీనినే మనం నిత్య జీవిత పోరాటంలో పాఠంగా మలచుకోవాలి. ఆ పాఠం మనల్ని సత్యసంధులుగా, న్యాయవేత్తలుగా, నీతిపరులుగా తీర్చిదిద్దుతుంది. మనో నిగ్రహం అలవడితే సద్గుణ సంపన్నులు అవుతారు. భక్తి, జ్ఞాన, వైరాగ్య భావనలు కలిగి, సమద ృష్టి అలవడుతుంది. అయితే ఆత్మ నిగ్రహానికి, ఆత్మస్థైర్యానికి అవినాభావ సంబంధం ఉంది. ఆత్మ స్థైర్యం ఉన్న మనిషికి ఆత్మ నిగ్రహం ఏర్పడుతుంది. ఆత్మ పట్ల నమ్మకం, విశ్వాసం ప్రోది చేసుకున్న వ్యక్తి ఆత్మ స్థైర్యాన్ని సంపూర?ంగా కైవసం చేసుకోవచ్చు. స్వార్థరహితమైన మనసు, ప్రవత్తి, వ్యాపకం వంటివి మనిషి ధీరోదాత్తతకు ఉపకరణాలు. ఏ ప్రలోభాలకూ లొంగని స్వభావం వల్ల మనిషి ఆత్మస్థైర్యాన్ని సంతరించుకుంటాడు. దైవం పట్ల ప్రత్యేక శ్రద్ధ లేకపోయినప్పటికీ తన పట్ల గురి, నమ్మకం ఉన్న వ్యక్తి ఆత్మస్థైర్య సంభూతుడే అవుతాడు. ఆత్మ స్థైర్యం మనిషి శక్తి సామర్థ్యాలను ద్విగుణీక ృతం చేస్తుంది. పిరికితనాన్ని పారదోలుతుంది. విద్యార్జనకు, ఆరోగ్య సాధనకు తోడ్పడుతుంది. భిన్నత్వం గల సమాజంలో ఏకతాభావన సాధించేందుకు బలం ఇస్తుంది. ఆధ్యాత్మిక అంశంలో సైతం ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది. అందువల్ల జీవితంలో ఉన్నత సోపానాలను అధిరోహించాలనుకునే ప్రతివ్యక్తి ఆత్మస్థైర్యం పెంపొందించుకుంటే ఆత్మనిగ్రహం దానికదే సొంతమవుతుంది. మనోనిగ్రహం ఆధ్యాత్మిక సాధనకు అత్యవసరం. లౌకిక విషయాల సాధనకు కూడా మనో నిగ్రహం అవసరం. అలాంటపుడే మనిషి సజ్జనుడుగా నలుగురిలో కీర్తింపబడతాడు. చంచల చిత్తమైన మనస్సును, విషయలోలత్వం నుంచి మరల్చి ఆత్మయందే స్థాపితం చేసి ఆత్మకు సర్వదా అధీనమై ఉండేటట్లు చేయాలని భగవద్గీత కూడా స్పష్టం చేసింది.

### స్మార్ట్ఫోన్స్తో 12 ఏళ్లలోపు పిల్లలపై తీవ్ర ప్రభావం
### పొంచి ఉన్న మానసిక అనారోగ్యం, ఊబకాయం
### చుట్టుముడుతున్న నిరాశ, నిద్రలేమి సమస్యలు
### స్క్రీన్ వినియోగం తగ్గించాలంటున్న నిపుణులు

# ఫోన్.. సమస్యల జోన్

తిండి, బట్ట, నీడ.. వాటి సరసన స్మార్ట్ఫోన్ కూడా వచ్చి చేరింది. ఎంతలా అంటే ఈ ఉపకరణం లేకుంటే జీవితమే లేదన్నంతగా. టీనేజ్కు రాకముందే పిల్లల వద్ద స్మార్ట్ఫోన్లు ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. 12 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు స్మార్ట్ఫోన్ కలిగి ఉండటం హానికరమని ఒక కొత్త అధ్యయనం తెలిపింది. చంటి పిల్లలు ఏడవకుండా ఉండేందుకు తల్లిదండ్రులు వారి స్మార్ట్ఫోన్లలో వీడియోలను చూపిస్తున్నారు. పిల్లలకు నడక మొదలైన నాటి నుంచే వారికి మొబైల్ ఫోన్లు అలవాటు చేస్తున్నారు. 'ఫోన్ ఇస్తే చాలు.. స్క్రీన్ స్క్రోల్ చేస్తూ ఓ మూలన కూర్చుంటారు. వాళ్లతో ఎటువంటి ఇబ్బంది ఉండదు'అనే ఆలోచనతో బలంగా అమలు చేస్తున్నారు. చదువు, విజ్ఞానం కోసం పిల్లలు స్మార్ట్ ఫోన్స్తో వెచ్చించే సమయం పిసరంత అయితే.. వీడియో గేమ్స్, రీల్స్, చాటింగ్కు సమయం కొండంత ఉంటోంది. అయితే పిల్లలకు స్మార్ట్ఫోన్స్ ఇవ్వడం స్వయంగా అనారోగ్యాన్ని తెచ్చిపెట్టినట్టేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పీడియాట్రిక్స్



| భారత్లో వయసుల వారీగా స్మార్ట్ఫోన్ కలిగి ఉన్నవారి శాతం.. వయసు | సొంత స్మార్ట్ఫోన్ |
|---|---|
| 8-9 | 30 |
| 12 | 70 |
| 10-14 | 83 |

| మొబైల్ స్క్రీన్ ముందు రోజూ వెచ్చిస్తున్న సమయం... వయసు | గంటలు |
|---|---|
| 2-4 | 2-2.5 |
| 5-8 | 3, ఆపైన |
| 8-12 | సగటున 5 |

జర్నల్లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం 12 ఏళ్లలోపు పిల్లలు స్మార్ట్ఫోన్ కలిగి ఉండటం వల్ల మానసిక అనారోగ్య సమస్యలు, ఊబకాయం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తేలింది. అంతేకాదు.. ఇతరులతో పోలిస్తే స్మార్ట్ఫోన్స్ ఉన్న పిల్లల్లో నిరాశ, నిద్రలేమి వంటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని వెల్లడైంది.

### ఎవరు విశ్లేషించారంటే..

యూఎస్లో 2018 నుంచి 2020 మధ్య కాలంలో అడాల్సెంట్ బ్రెయిన్ కాగ్నిటివ్ డెవలప్మెంట్ (ఏబీసీడీ) అధ్యయనంలో 10,588 మంది కౌమారదశ పిల్లలు పాలుపంచుకున్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ నిధులు సమకూర్చిన ఈ అధ్యయనం యూఎస్లో 'మెదడు అభివ ృద్ధి, పిల్లల ఆరోగ్యం'పై అతిపెద్ద దీర్ఘకాలిక అధ్యయనంగా నిలిచింది. చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆఫ్ ఫిలడెల్ఫియా, బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, కొలంబియా విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ అధ్యయన సమాచారాన్ని విశ్లేషించారు. వారి కంటే మెరుగ్గా..: ఏబీసీడీ అధ్యయనంలో పాల్గొన్న వారిలో 63.6% మందికి స్మార్ట్ఫోన్స్ ఉన్నాయి. సగటున 11 ఏళ్లకే వారు ఈ ఉపకరణాన్ని దక్కించుకున్నారు. ఆ డేటా ఆధారంగా చిన్న పిల్లల వద్ద స్మార్ట్ఫోన్ ఉండటం వల్ల నిద్రలేమి, ఊబకాయం వంటి ప్రమాదాలు పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నాయని పరిశోధకులు నిర్ధారించారు. స్మార్ట్ఫోన్ కలిగి ఉన్నవారిలో తక్కువ వయసున్న పిల్లల్లో ఆరోగ్య ఫలితాలు మరింత దిగజారుతున్నాయని వెల్లడైంది. 12 సంవత్సరాల వయసులోపు స్మార్ట్ఫోన్ పొందిన పిల్లలను, స్మార్ట్ఫోన్ లేని పిల్లలను కూడా ఈ అధ్యయనం పోల్చింది. ఒక సంవత్సరం తరువాత స్మార్ట్ఫోన్లు లేనివారు వాటిని కలిగి ఉన్న వారి కంటే మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని అనుభవిస్తున్నారని పరిశోధకులు కనుగొన్నారు. పిల్లల దగ్గర ట్యాబ్లెట్ పీసీలు లేదా ఐప్యాడ్స్ వంటి ఇతర పరికరాలు ఉండవచ్చని.. వాటి వినియోగం వల్ల కూడా ఫలితాలు ఇలాగే ఉంటాయని తెలిపారు. ఓ కన్నేసి ఉంచండి..: అయితే స్మార్ట్ఫోన్లు కౌమారదశలో ఉన్న అందరి ఆరోగ్యానికి హానికరమని తాము చెప్పడం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. సానుకూల, ప్రతికూల పరిణామాలను సమతౌల్యం చేస్తూ అధిక స్క్రీన్ వినియోగం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలను జాగ్రత్తగా పరిశీలించాలని వారు సూచిస్తున్నారు. పిల్లలకు ఫోన్ ఇచ్చే ముందు ఎంత సమయం వాడాలనే అంశాన్ని స్పష్టంగా వివరించాలన్నారు. బెడ్రూమ్లో, భోజనం, హోంవర్క్ సమయంలో ఎలా వాడాలో తెలియజేయాలని... ప్రైవసీ, కంటెంట్ సెట్టింగ్స్ను మార్చాలని సూచిస్తున్నారు. పిల్లలు వారి ఫోన్లలో ఏమి చేస్తున్నారో పర్యవేక్షించాలని... అనుచితమైన కంటెంట్కు వారు గురికాకుండా, స్మార్ట్ఫోన్లు నిద్రకు అంతరాయం కలిగించకుండా చూసుకోవాలని చెబుతున్నారు.


ప్రపంచవ్యాప్తంగా 12 ఏళ్లలోపు పిల్లల్లో 71%, 10 ఏళ్లలోపు చిన్నారుల్లో 42% మంది వద్ద సొంత స్మార్ట్ఫోన్ ఉంది.

ప్యూ రీసెర్చ్ ప్రకారం 2024లో 13-17 ఏళ్ల టీన్స్లో 95% మంది స్మార్ట్ఫోన్ కలిగి ఉన్నారు.

12 ఏళ్లలోపు వారిలో 42% మంది ప్రతిరోజూ సగటున 2-%4 గంటలు డిజిటల్ తెరల ముందు గడుపుతున్నారు.

# ట్యాబ్లెట్లను వాడుతున్నా కూడా.. థైరాయిడ్ అదుపులోకి రావడం లేదంటే కారణాలు ఇవే..!

కాలేయాన్ని కాటు వేసే మహమ్మారిని గుర్తించే సరికొత్త ఆవిష్కరణ..



కాలేయానికి ప్రాణాంతకంగా మారే హెపటైటిస్-బి వైరస్‌ను గుర్తించడం ఇకపై మరింత సులభం కానుంది. సాధారణంగా ఈ వ్యాధి నిర్ధారణ కోసం పెద్ద పెద్ద ల్యాబొరేటరీలు, ఖరీదైన యంత్రాలు, రోజుల కొద్దీ నిరీక్షణ తప్పనిసరి. కానీ, ఆస్ట్రేలియాకు చెందిన కిర్బీ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఇప్పుడు ఒక విప్లవాత్మక 'ఫింగర్‌స్టిక్' (ఖీఱఅస్త్రవతీర్‌ఱఛిఏ) పరీక్షను అందుబాటులోకి తెచ్చారు.

ఆస్ట్రేలియాలో ప్రపంచంలోనే మొట్టమొదటి ట్రయల్ హెపటైటిస్ బి డి ఎన్ ఏ కు సంబంధించిన ఒక సాధారణ ఫింగర్‌స్టిక్ పరీక్ష అనేది ప్రామాణిక ప్రయోగశాల పరీక్ష వలె ఖచ్చితమైనదని, మారుమూల ప్రాంతాలలో ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు.

ఏమిటీ ప్రత్యేకత ఏమిటంటే..?

ప్రస్తుతం అందుబాటులో ఉన్న పద్ధతుల్లో సిరల నుంచి రక్తాన్ని సేకరించి ల్యాబ్‌కు పంపాల్సి ఉంటుంది. కానీ ఈ కొత్త విధానంలో డయాబెటిస్ పరీక్షలాగే వేలిపై చిన్న సూదితో గుచ్చి, ఒక చుక్క రక్తంతో పరీక్ష నిర్వహించవచ్చు. దీని కోసం రోజుల తరబడి వేచి చూడక్కర్లేదు. కేవలం 60 నిమిషాల్లోనే ఫలితం వెల్లడవుతుంది. ఈ పాయింట్ ఆఫ్ కేర్ (ూూజ) పరీక్షా ఫలితాలు, ఖరీదైన ల్యాబ్ పరీక్షలతో సమానమైన కచ్చితత్వాన్ని కలిగి ఉన్నట్లు క్లినికల్ ట్రయల్స్‌లో తేలింది.

ఎందుకు ముఖ్యం అంటే..?

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25.4 కోట్ల మంది ఈ వైరస్‌తో బాధపడుతుంటే, అందులో కేవలం 10 శాతం మందికి మాత్రమే తమకు ఇన్ఫెక్షన్ ఉందనే విషయం తెలుస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఉండేవారికి సరైన పరీక్షా కేంద్రాలు అందుబాటులో లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ కొత్త విధానం వల్ల మారుమూల గ్రామాల్లో సైతం సులభంగా పరీక్షలు నిర్వహించి, వెంటనే చికిత్స ప్రారంభించే అవకాశం ఉంటుంది" అని పరిశోధనకు నాయకత్వం వహించిన ప్రొఫెసర్ గెయిల్ మాథ్యూస్ తెలిపారు.

సకాలంలో గుర్తిస్తే..

హెపటైటిస్-బి ని సకాలంలో గుర్తిస్తే కాలేయం దెబ్బతినకుండా (జఱతీతీష్ట్రశీంఱం), కాలేయ క్యాన్సర్ బారిన పడకుండా ప్రాణాలు కాపాడుకోవచ్చు. 2030 నాటికి హెపటైటిస్-బి రహిత ప్రపంచాన్ని నిర్మించాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) లక్ష్యానికి ఈ ఆవిష్కరణ పెద్ద ఊతాన్నిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఇది కూడా చదవండి..ఋఝతీఅఅ : మైక్రోప్లాస్టిక్స్ ముప్పును తొలగించే అస్త్రం.. 'చింతపండు'.. తాజా పరిశోధనలో వెల్లడి..




గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి

## జీవనశైలి, ఆహారం హోమియోపతి చికిత్సల ప్రభావాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?




హోమియో మందులు వాడేటప్పుడు ఆహార నియమాలు పాటించాలా..?హోమియోపతి అంటే ఏమిటి..?అది ఎలా పని చేస్తుంది? హోమియోపతి మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు ఏమిటి? హోమియోపతి చికిత్స ఫలితాల విషయంలో సాధారణంగా ఎంత సమయం పడుతుంది..? ఒక నిర్దిష్ట పరిస్థితికి హోమియోపతి నివారణను ఎలా ఎంచుకోవాలి? హోమియోపతి చికిత్స ద్వారా ఎలాంటి వ్యాధులు తొందరగా నయమవుతాయి..? ఈ అంశాలకు సంబంధించి ప్రముఖ హోమియో వైద్య నిపుణులు మధు వారణాసి సాక్షిలైఫ్ కు వివరించారు. ఈ కింది వీడియో చూసి ఆ విశేషాలు ఆయన మాటల్లోనే తెలుసుకోండి. గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

పిల్లలు, గర్భిణీ స్త్రీలకు హోమియోపతి సురక్షితమేనా..? హోమియోపతి ప్రత్యేకించి ప్రభావవంతంగా ఉండే నిర్దిష్ట పరిస్థితులు లేదా వ్యాధులు ఏమైనా ఉన్నాయా? చికిత్స ప్రక్రియలో హోమియోపతి ప్రాక్టీషనర్ ఏ పాత్ర పోషిస్తాడు? హోమియోపతి మందులు ఎలా తయారు చేస్తారు? సాంప్రదాయ వైద్యంతో పోలిస్తే హోమియోపతి వైద్యం ఎలా పనిచేస్తుంది? దీర్ఘకాలిక రోగాలకు హోమియోపతి మందులు ప్రభావవంతంగా పనిచేస్తాయా? హోమియోపతి మందులు పనిచేసే విషయంలో శాస్త్రీయ ఆధారాలేమైనా ఉన్నాయా..? సాంప్రదాయ వైద్య చికిత్సలతో పాటు హోమియోపతి మందులు తీసుకోవచ్చా..? క్యాన్సర్ కు హోమియోపతిలో చికిత్స ఉందా..? దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు హోమియో వైద్యంతో తగ్గుతాయా..? హోమియో మందులు తీసుకుంటే ఏమేమి తినకూడదు..? హోమియోపతి వైద్య విధానంలో ఎలాంటి వ్యాధులు తొందరగా తగ్గుతాయి..? అల్లోపతి మందులతో పాటు హోమియోపతి మందులు వాడొచ్చా..? దీనివల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయా..?




## అంతరిక్షంలో ప్రసవం.. సురక్షితమేనా..?




మనుషులు విశ్వాంతరాళంలో విస్తరించాలనే ఆలోచనతో ఎప్పటి నుంచో పరిశోధనలు చేస్తున్నారు శాస్త్రవేత్తలు. అంగారకుడిపై కాలనీలు, చంద్రునిపై నివాసాల గురించి చర్చ జరుగుతోంది. అయితే, అంతరిక్షంలో మానవ మనుగడ సాగాలంటే అక్కడ పునరుత్పత్తి సాధ్యమేనా? గర్భధారణ, ప్రసవం సురక్షితంగా జరుగుతాయా? అన్న అంశంపై ఇటీవల జరిగిన పరిశోధనలు దిగ్భ్రాంతి కలిగించే విషయాలను వెల్లడించాయి.

అంతరిక్షంలో..

'రిప్రొడక్టివ్ బయోమెడిసిన్ ఆన్‌లైన్' జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ప్రకారం.. ప్రస్తుత పరిస్థితుల్లో అంతరిక్షంలో ప్రసవం ఏమాత్రం సురక్షితం కాదు. భూమికి దూరంగా, అనంతవాయువుల మధ్య ఉండే వాతావరణం మానవ పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రధాన అడ్డంకులు ఏంటి..?

అంతరిక్షంలో ఉండే శక్తివంతమైన కాస్మిక్ కిరణాలు మన కణాల్లోని ఐచీూను దెబ్బతీస్తాయి. ఇది పురుషుల్లోని శుక్రకణాలను, మహిళల్లోని అండాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా పిండం ఎదుగుదల ఆగిపోవడం లేదా జన్యుపరమైన లోపాలు తలెత్తే ప్రమాదం ఉంది.

సూక్ష్మ గురుత్వాకర్షణ ..

భూమిపై ఉండే గురుత్వాకర్షణ శక్తి పిండం అభివృద్ధికి, గర్భాశయంలో శిశువు స్థితికి ఎంతో కీలకం. శూన్యంలో పిండం ఎదుగుదల ఎలా ఉంటుందనే దానిపై జంతువులపై జరిపిన ప్రయోగాలు మిశ్రమ ఫలితాలను ఇచ్చాయి. ఒత్తిడి - రిథమ్.. అంతరిక్ష ప్రయాణాల్లో కలిగే మానసిక ఒత్తిడి, నిద్ర వేళల్లో మార్పులు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి.

పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం..

సుదీర్ఘకాలం అంతరిక్షంలో గడిపే వ్యోమగాముల్లో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. రేడియేషన్ ప్రభావం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా పొంచి ఉంది. తక్కువ కాలం ప్రయాణించే వారిపై పెద్దగా ప్రభావం ఉండకపోయినప్పటికీ.. అక్కడే నివాసం ఉండాలనుకునే వారికి మాత్రం ఇది పెను సవాలే.

అంతరిక్షంలో మానవ కాలనీలు ఏర్పాటు చేయడం సాంకేతికంగా సాధ్యమే కావొచ్చు. కానీ, ఒక ప్రాణం భూమికి వెలుపల సురక్షితంగా జన్మించగలదా? అన్న ప్రశ్నకు సైన్స్ వద్ద ఇంకా పూర్తిస్థాయి సమాధానం లేదు. దీనిపై మరిన్ని లోతైన పరిశోధనలు జరగాల్సి ఉంది.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

## ఆకు కూరలు వండి తిందామా!





పచ్చదనంతో నిండిన ఆకుకూరల్లో పోషకాలు ఎక్కువ. ఇవి రోగనిరోధకశక్తిని మెరుగుపరుస్తాయనీ మనకు తెలుసు. కానీ, కొన్ని ఆకుకూరలను ఉడికించి తినడం వల్ల వాటి పోషక విలువలు రెట్టింపు అవుతాయి అంటున్నారు నిపుణులు.

అవేంటంటే.. పాలకూరలో ఆక్సాలిక్ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కాల్షియం, ఐరన్, విటమిన్ ఇ వంటి పోషకాలను శరీరం గ్రహించకుండా అడ్డుకునే ఆస్కారం ఉంది. పాలకూరను ఉడికిస్తే దీనిలోని ఆమ్ల శాతం తగ్గి పోషకాలు అందడంతోపాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలా అని ఎక్కువ సమయం ఉడికించడం కూడా మంచిది కాదు. విటమిన్ ఎ, సి, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉండే మునగాకు ఉడికించి తింటే అందులో పోషకాలు పెరుగుతాయి. ఇవి శరీరంలో వాపు, మంటలను తగ్గిస్తాయి. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. యాంటీఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గిస్తాయి. కెలోరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉండే బచ్చలిని ఉడికించి తినడం మేలు. ఇలా చేయడంవల్ల దానిలో బీటా కెరోటిన్, మెగ్నీషియం స్థాయులు పెరుగుతాయి. అంతేకాదు, దీన్నుంచి లభించే విటమిన్ ఎ, సి, కాల్షియం, పొటాషియం వంటి పోషకాలు శరీరానికి సమపాళ్లలో అందుతాయి. అయితే కొన్ని ఆకుకూరల్ని మాత్రం సన్నని సెగమీద కొంచెం నూనెతో వేయించడం వల్ల పోషకాలు పెరుగుతాయి. వాటిలో తోటకూర ఒకటి. దీన్ని వేయించడం వల్ల ఫోలేట్, విటమిన్ సి పెరిగి రోగనిరోధకశక్తిని పెంచుతాయి. మెంతికూరను వేయిస్తే పాలీఫినాల్స్ పెరిగి జుట్టు, చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి.







అవేంటంటే.. పచ్చదనంతో నిండిన ఆకుకూరల్లో పోషకాలు ఎక్కువ. ఇవి రోగనిరోధకశక్తిని మెరుగుపరుస్తాయనీ మనకు తెలుసు. కానీ, కొన్ని ఆకుకూరలను ఉడికించి తినడం వల్ల వాటి పోషక విలువలు రెట్టింపు అవుతాయి అంటున్నారు నిపుణులు.

## అతి వద్దు సుమీ!



అమ్మాయిలకు అందంపైనా, ఆరోగ్యంపైనా స్పృహ రోజు రోజుకీ పెరుగుతోంది. దీంతో తక్కువ సమయంలోనే బరువు తగ్గాలని కొందరు... దృఢంగా మారిపోవాలని మరికొందరు అతిగా వ్యాయామాలు చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రయోజనాల సంగతి దేవుడెరుగు... దుష్ప్రభావాలు తప్పవంటున్నారు నిపుణులు. అది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో తెలుసా?

ఒత్తిడి పెరుగుతుంది...

వ్యాయామం చేయడం వల్ల ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. అయితే, మితిమీరి వర్కవుట్స్ చేయడం వల్ల కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. దీంతో శరీరమే కాదు... మనసూ అలసిపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారాన్ని బట్టి రోజూ 45 నిమిషాల నుంచి గంట వరకూ కసరత్తులకు కేటాయించుకుంటే సరిపోతుంది.


ఎక్కువ తినేలా చేస్తుంది...


అధిక వ్యాయామం వల్ల గ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. దీంతో కసరత్తులతో కరిగించిన కెలొరీలు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేలా చేస్తాయి. దీంతో నాజూగ్గా మారాలన్న లక్ష్యం పక్కకెళ్లి... మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంది.

హార్మోన్ల హెచ్చుతగ్గులు...

మితంగా చేసే వ్యాయామం... హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. అదే విశ్రాంతి లేకుండా అతిగా చేస్తే శరీరంపై ఒత్తిడి పెరిగి అవి హెచ్చుతగ్గులకు గురవుతాయి. ముఖ్యంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి ఇతర హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ తగ్గుతాయి. నెలసరిని క్రమం తప్పిస్తాయి. భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల బారిన పడేలానూ చేస్తాయి. కాబట్టి ఆ సమయం గంట దాటకుండా ఉంటే మేలు

## అవసరంలేకున్నా యాంటీబయోటిక్స్ వాడితే ప్రాణాపాయం.. ఐఎంఏ హెచ్చరిక






చిన్నపాటి జ్వరం వచ్చినా, ఒళ్లు నొప్పులు అనిపించినా వెంటనే మెడికల్ షాప్ కి వెళ్లి యాంటీబయోటిక్స్ కొనేస్తున్నారా? అయితే మీకు ప్రాణాపాయం తప్పదు..! యాంటీబయోటిక్స్‌ను విచక్షణారహితంగా వాడటం వల్ల మానవాళికి 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' అనే అదృశ్య ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' సహకారంతో దేశవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఏఎంఆర్..

సాధారణంగా శరీరంలోని హానికారక బ్యాక్టీరియాను చంపడానికి యాంటీబయోటిక్స్ వాడతాం. అయితే అవసరం లేకున్నా వాడటం లేదా డాక్టర్ చెప్పిన కోర్సును మధ్యలోనే ఆపేయడం వల్ల సదరు బ్యాక్టీరియా ఆ మందులను తట్టుకునే శక్తిని పెంచుకుంటుంది. ఫలితంగా భవిష్యత్తులో ఆ మందులు శరీరంలో పని చేయవు. చివరకు చిన్నపాటి ఇన్ఫెక్షన్లు కూడా నయం కాక ప్రాణాపాయానికి దారితీస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ఇప్పటికే ూవీ=ను గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది.

వినూత్న కార్యక్రమాలు..

ఈ ముప్పును అరికట్టేందుకు 12 రాష్ట్రాల్లోని ప్రతి జిల్లాలోనూ వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలు, నివాస సముదాయాల్లో వైద్యులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భారీ ర్యాలీలు చేపట్టి ప్రజలకు 'ఏఎంఆర్' తీవ్రతను వివరించారు. తప్పుడు మందుల వినియోగం వల్ల చికిత్స విఫలమైన కేసులను ఉదహరిస్తూ నిపుణులు ప్రజలను అప్రమత్తం చేశారు. కేవలం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటీబయోటిక్స్ వాడాలని స్పష్టం చేశారు.

ఎ ్ ు ద ు ్ య ల ు

ఏమంటున్నారంటే..?

జలుబు, దగ్గు వంటి వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీబయోటిక్స్ పనిచేయవు. కాబట్టి సొంత వైద్యం వద్దు. డాక్టర్ ఐదు రోజులు మందులు వాడాలని చెబితే, రెండు రోజుల్లో నయం అయిందని ఆపేయకూడదు. దీనివల్ల బ్యాక్టీరియా మందులను తట్టుకునేలా రూపాంతరం చెందుతుంది. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన నీరు తాగడం ద్వారా ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. తద్వారా యాంటీబయోటిక్స్ అవసరమే పడదు. ఈ రోజు మనం వాడుతున్న అనాలోచిత యాంటీబయోటిక్స్, రేపటి తరం చికిత్సకు మందులే లేకుండా చేస్తున్నాయి.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

Published & Owner, Editor: Ch Jangaiah, Printing at Swarna Bharatha Jyothi Printers, Office Address. H.no. 7-2-B6/3/4 Malikarjuna nagar, Bairamalguda, Sagar Ring road, L.B.Nagar, Telangana, RNI No. APTEL/2007/20124, Cell: 9666282126, Email:swarnabharathajyothi2024@ gmail.com, Website: www.swarnabharathajyothi.com